క్లుప్తంగా

పేపర్ లోడ్ కంటైనర్ బోల్తా

రేణిగుంట: భద్రాచలం సారపాక ఐటీసీ కంపెనీ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరు వైపు వెళ్తున్న ఐటీసీ పేపర్ లోడ్ కంటైనర్ లారీ గురువారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని కేఎల్ఎం హాస్పిటల్ సర్కిల్‌లో చోటుచేసుకుంది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి గాజులమండ్యం పోలీసులు చేరుకుని పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ లెవల్ వన్ 2025లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ రూపాదేవి తెలిపారు. ఈ ఫలితాల్లో మ్యాట్ -74, పాట్-46, చాట్-47 మొత్తం 167మంది విద్యార్థులు ఎంపికయ్యారని, తమ విద్యార్థులు గురువుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వలనే ఇంతటి ఘన విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సతీష్, డీన్ త్రివేణి, ఇన్‌చార్జ్‌లు కల్పన, శ్రీహరి, వంశీ, ఏఓ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీగా షణ్ముగరామ్

బుచ్చినాయుడుకండ్రిగ: ఈఓపీఆర్‌డీగా షణ్ముగరామ్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రాజశేఖర్ బదిలీపై వెళ్లడంతో తిరుపతిలోని డీపీఆర్‌సీలో కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న షణ్ముగరామ్ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

టపాసుల దుకాణాలు పరిశీలన

రేణిగుంట: దీపావళి పండుగ సందర్భంగా రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న నాలుగు టపాకాయల దుకాణాలను గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఐ నాగరాజు పరిశీలించారు. దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని వ్యాపారులకు సూచించారు. టపాసుల విక్రయానికి సంబంధించిన లైసెన్సు, సరైన దూరం, అగ్ని ప్రమాద నియంత్రణ చర్యలను ప్రధానంగా పరిశీలించారు.

కార్డుల పంపిణీ



కార్డులను పంపిణీ చేస్తున్న ఏఈఓ రేవతి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం మండల వ్యవసాయ విస్తరణాధికారిణి రేవతి రైతులకు ఎరువు పంపిణీ నిమిత్తం కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, వరి, వేరుశనగ పంటలకు యూరియాను కోటా పద్ధతిలో పంపిణీ చేయడం కోసం కార్డులను ఇస్తున్నామని, ఈ కార్డుల కోసం రైతులు భూమి పాసు బుక్, ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకురావాలన్నారు. ఎకరాకు మూడు దఫాలలో మూడు బస్తాల యూరియా ఇస్తామన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టరూ!

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీలో దోమలు స్వైర విహారానికి ప్రజలు విష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతుని, పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని కోరుతూ గురువారం పంచాయతీ కార్యదర్శి ఎంజి రమేష్‌బాబుకు సీఐటీయూ నాయకులు వినతి పత్రం ఇచ్చారు.ఇటీవల కురిసిన వర్షం వల్ల పంచాయతీలో విపరీతంగా పిచ్చిమొక్కలు పెరగడం దోమలు, విషకీటకాలు విజృంభిస్తున్నాయని నివేదించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ మండల కన్వీనర్ సెల్వ రాజు, దీప తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా శివకుమార్

వరదయ్యపాళెం: డిప్యూటీ ఎంపీడీఓగా జి.శివకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న మధుసూదన్ ఈటీసీ సెంటర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శివకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు , తాగునీటి సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు.

దళారులదే రాజ్యం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ కార్ పార్కింగ్ రుసుం వసూలు చేసే సిబ్బంది దళారుల అవతారం ఎత్తుతున్నారు. నేరుగా ఆలయం లోపలికి కారు వెళ్లేలా చేస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా ఓ ప్రైవేటు అతిథి గృహం బావుంటుందని, ఆలయ అతిథి గృహాలు, మిగిలినవేవీ బాగుండవంటూ భక్తులను తప్పుదారి పట్టిస్తున్నారు. వాహనదారులకు ఎక్కడ పార్కింగ్ చేయాలో చెప్పకపోవడం మూలాన ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపి వెళ్లిపోతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొన్నాలమ్మ గుడి వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ స్తంభిస్తోంది. మరోవైపు..రూ1000 ఇస్తే నేరుగా అంతరాలయ దర్శనం చేయిస్తామని కొందరు పీఆర్‌పీ ఆఫీసు సిబ్బంది, దళారులతో కుమ్మక్కై దర్శనాలు చేయిస్తున్నారు! ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది.

జడివాన..!

- కలుజు పారిన తొండమనాడు చెరువు



కలుజు పారుతున్న తొండమనాడు చెరువు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గురువారం జడివాన కురిసింది. ఉదయం నుంచి వర్షం ఆగి..ఆగి పడుతుండడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ వీధులు బురద గుంతలను తలపించాయి. వర్షాలకు రైతులు రబీ సీజన్ సాగుబడికి సన్నద్ధమవుతున్నారు. వర్షానికి శ్రీకాళహస్తి మండలం తొండమనాడు చెరువు పొంగి కలుజు పారింది. -ఏర్పేడు



కురుస్తున్న జడివాన

నోటీస్ బోర్డు

నేడు రచ్చబండ.. కోటి సంతకాల సేకరణ

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రమైన నారాయణవనంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సారకాయలు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు స్థానిక బైపాస్ రోడు సమీపంలోని దూండి వినాయకస్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నాలుగు పంచాయతీలలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు మండలంలోని పెద్దపాలేడులో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొణతనేని మణినాయుడు తెలిపారు. ఆ తర్వాత చిన్నయగుంట, జీ.ఎన్.కండ్రిగ, ఆర్ అనంతాపురం గ్రామాల్లో ఇదే కార్యక్రమం నిర్వహిస్తామని, సమన్వయకర్త నూకతోటి రాజేష్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బీరేంద్రవర్మ హాజరవుతారని, మండలంలోని అన్ని విభాగాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసుల 'పల్లె నిద్ర'



కాలనీవాసులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ మంజునాథరెడ్డి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం దళితవాడలో గురువారం రాత్రి రూరల్ సీఐ మంజునాథ రెడ్డి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులతో సమావేశమై మాట్లాడారు. శాంతిభద్రతలు, ఆన్‌లైన్ మోసాలు, కొత్త వ్యక్తుల కదలికలు, సైబర్ మోసాలు, రోడ్డు భద్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎస్ఐ ప్రవళిక, ఏఎస్ఐ జగదీష్ నాయుడు, కానిస్టేబుల్ మునస్వామి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలో 47మంది ఎంపిక



నియామక పత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 47మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజశేఖర్‌బాబు తెలిపారు. పది కంపెనీలలో ఉద్యోగాలకు 220మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. 47మంది ఎంపికవగా, మరో 76మంది షార్ట్ లిస్ట్ అయి ఉన్నారని ప్రిన్సిపల్ చెప్పారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కో-ఆర్డినేటర్ ఉషారాణి, ప్లేస్‌మెంట్ మేనేజర్ భానుచంద్రారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ భారతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దీన దయాల్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

కలంకారీ శిక్షణ తరగతులు ప్రారంభం



ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలిలో గురువారం ఆర్ఎస్ఈటీఈ, సెర్ప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా 'కలంకారీ, మగ్గం, ఆర్య వర్క్, పెయింటింగ్‌పై మహిళలు, యువతులకు శిక్షణ శిబిరం ప్రారంభించారు. నెల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవి, సర్పంచ్ కందాటి గురవమ్మ, ఏర్పేడు సింగిల్‌విండో చైర్మన్ మహేష్‌రెడ్డి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఇసుకతాగేలి గ్రామ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచుకోండి

నారాయణవనం: అందుబాటులో ఉన్న వనరులతో గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని పెంచుకుని అభివృద్ధి పథంలో పయనించాలని ఎంపీడీఓ అరుణ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల ఆదాయ, వ్యయ ప్రగతిని కార్యదర్శులు నివేదించారు. ఆర్థిక సంఘం నిధులను సంబంధిత పనులకు మాత్రమే వినియోగించుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో వేణయ్య అన్నారు. జెడ్పీటీసీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ, పేదల ఇళ్లకు వేలల్లో పన్నులు వేయడం సరికాదన్నారు. మండలంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్, నర్సింగ్, డిగ్రీ కళాశాలల నుంచి ఆస్తి పన్ను ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. పది రోజుల్లో ఎరికంబట్టు, డీకే పాళ్యం, కల్యాణపురం పంచాయతీల పరిధిలోని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను సంప్రదించి, పన్నులు వసూలు చేయాలని కోరారు. కిలోమీటర్ల దూరం అడవిలో నడిచివెళ్లి ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనం వేయడంలో ఆలస్యం చూపుతున్న అధికారులు అడవిలో కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు మాత్రం లక్షల్లో నిధులను ఎలా మంజూరు చేస్తారని ఆయన ప్రశ్నించారు. తీరు మార్చుకోని అధికారులు బదిలీ చేసుకొని వెళ్లిపోవాలన్నారు. వివిధ శాఖల ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో తహసీల్దార్ రోజా రాణి, వైస్ ఎంపీపీ శివశంకర్, పీఏసీఎస్ చైర్మన్ షణ్ముగం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్షయ క్షేత్రంలో అన్నదానం



రేణిగుంట: తమిళనాడు పల్లిపట్టులో 2009లో జరిగిన టపాసుల గోడౌన్ పేలుళ్ల ఘటనలో రేణిగుంట ఓల్డ్ చెక్ పోస్టుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సోమశేఖర్ మృతి చెందారు. అతడి జ్ఞాపకార్థం అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులు విమానాశ్రయం రహదారిలోని అక్షయ క్షేత్రంలో గురువారం రాత్రి మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. 16 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలో మృతి చెందిన సోమశేఖర్‌కు ఇంకా న్యాయం జరగలేదని, ఇప్పటికీ ఆ కేసు తమిళనాడులోని తిరువళ్లూరులో పెండింగ్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

బాబు రాజకీయ ప్రయోజనాల కోసమే..!

- కర్నూలులో జీఎస్టీ సమావేశంపై మాజీ ఎంపీ విమర్శ
- రూ.15కోట్ల ప్రజాధనం చంద్రబాబు వృథా చేశారని మండిపాటు



సత్యవేడులో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

సత్యవేడు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రయోజనాల కోసమే కర్నూలుకు ప్రధాని నరేంద్రమోదీని రప్పించి జీఎస్టీ సమావేశం ఏర్పాటు చేశారని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడి, డీజీపీ (హరియాణా)వేధింపుల ఉదంతాన్ని ఖండిస్తూ గురువారం స్థానిక గాంధీ విగ్రహం సమీపంలో ఆయన నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పు విసిరిన ఉదంతం కూడా ఇదే కోవలోకి వస్తుందని పేర్కొన్నారు. అలాగే, హరియాణాలో దళితుడైన డీజీపీ ఎన్నో అవమానాలు పడినట్లు తొమ్మిది పేజీల సూసైడ్‌నోట్ రాయడం కలచివేసిందన్నారు. కర్నూలులో జరిగిన జీఎస్టీ సమావేశం వల్ల పేదలకు ఒరిగిందేమి లేదని, ప్రస్తుత జీఎస్టీ వల్ల కార్ల ధరలు తప్పితే పప్పులు, నూనె, బియ్యం , బస్సుచార్జీలు, రైలు చార్జీలు తగ్గలేదని స్పష్టం చేశారు. సుమారు రూ.15 కోట్ల ప్రజాధనం ఈ సమావేశానికి సీఎం ఖర్చు చేశారని దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేయని జీఎస్టీ ప్రచారం రాష్ట్రంలో చంద్రబాబు చేయడం వెనుక పూర్తిగా ఆయన స్వప్రయోజనాల కోసమేనని విమర్శించారు. కార్యక్రమంలో పురుషోత్తం, సురేంద్ర నాయుడు, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌తో శ్రీ నిధి రుణాల చెల్లింపు

సత్యవేడు: స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న శ్రీనిధి రుణాలను మొబైల్ యాప్ నుంచి సులువుగా చెల్లించవచ్చని ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ అన్నారు. గురువారం దాసుకుప్పంలో శ్రీనిధి క్లస్టర్ల మేనేజర్ ఆదిల్ బాషా ఆధ్వర్యంలో శ్రీనిధి పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మొబైల్‌యాప్ వాడకంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాసవిహారి, వెలుగు కో-ఆర్డినేటర్ పుల్లయ్య, మంజుల, ధన తదితరులు పాల్గొన్నారు.

కొత్తకండ్రిగ ఏరును పరిశీలించిన తహసీల్దార్



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరు, కొత్తకండ్రిగ గ్రామాల మధ్య ఉన్న కారణి ఏరు కాజ్‌వేను గురువారం తహసీల్దార్ శ్రీదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, భారీ వర్షాలకు ఏరు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, గ్రామస్తులు కాజ్‌వేను దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏరు ఉధృతంగా ప్రవహిస్తే కాజ్‌వేపై వెళ్లకూడదని గ్రామంలో దండోరా వేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తలారివెట్టు వద్ద ఏడు గండ్లు వారధిని పరిశీలించారు.కార్యక్రమంలో వీఆర్ఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి సారూ!



సమస్యను డిప్యూటీ ఎంపీడీఓకు నివేదిస్తున్న సంతవేలూరు దళితవాడ మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామ మహిళలు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని డిప్యూటీ ఎంపీడీఓకు తాగునీటి సమస్యలను నివేదించారు. కొన్ని రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ స్పందించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డైట్ లెక్చరర్ హేమలత



ఇంగ్లిష్ వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ

పాఠశాలల తనిఖీ

శ్రీకాళహస్తి: కార్వేటినగరం డైట్ సీనియర్ లెక్చరర్ ఏ హేమలత గురువారం పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ బీపీ అగ్రహారం పాఠశాలలను తనిఖీ చేశారు. టీచర్ హ్యాండ్ బుక్స్, అసెస్‌మెంట్ బుక్స్, విద్యార్థుల ప్రగతి, హోలిస్టిక్ కార్డ్స్, స్టూడెంట్ అటెండెన్స్ విద్యాప్రవేశ్, రీడింగ్ అండ్ రైటింగ్ ఎబిలిటీ, ఎఫ్ఎల్ఎన్, టీచింగ్ అట్ రైట్ లెవెల్ అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటకాల రుచి చూశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, నౌజియా, సీఆర్‌ఎం టి.మునిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్ నైపుణ్యం పెంపొందించేలా చూడాలని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం ఆదేశించారు. గురువారం ఆయన కారణి దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఇంగ్లిష్ వర్క్ బుక్స్ పరిశీలించిన అనంతరం టీచర్లతో మాట్లాడారు. విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.



నక్కల కాలువ వద్ద కూలిపోయిన గోడ



మిట్టకండ్రిగ వద్ద రోడ్డు పక్కన తీసిన కాలువ

ఆదమరిస్తే ఆస్పత్రికే..!

శ్రీకాళహస్తి: పట్టణంలో పానగల్ సమీపంలోని నక్కల కాలువ వద్ద నిర్మించిన బ్రిడ్జి ఒక వైపు గోడ కాలువలో పడిపోయింది. ఇక్కడ టర్నింగ్ ఉండటం వల్ల దగ్గరకు వచ్చేంతవరకు ఇది కనబడడం లేదు. రోడ్డు పక్కన చిన్న రాళ్లు మాత్రమే పెట్టి చేతులు దులుపుకున్నారు. కేబుల్ లో పైపులైన్లు ఏర్పాటు చేయడం కోసం పదేపదే ఈ కాలువ పక్కన గోడ పక్కన తవ్వడం వల్ల ఈ పరిస్థితి కలిగింది. అంతేకాకుండా మిట్టకండిగ సమీపంలో పెట్రోల్ బంక్ దాటిన తర్వాత రోడ్డు పక్కన పెద్ద కాలువ తీశారు. వర్షానికి ఆ కాలువ మునిగిపోతే పైకి ఏమీ కనపడదు. ఇది ప్రమాదాలకు ఆస్కారమిచ్చేలా ఉంటోంది. ఆదమరిస్తే ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవక తప్పదని ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పార్టీ అనుబంధ విభాగాల్లో చోటు

వరదయ్యపాళెం: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో నియోజకవర్గంలోని పలువురికి చోటు కల్పించినట్లు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ గురువారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్సీ సెల్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా వరదయ్యపాళెం మండలం తొండూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎల్లావూరు రమణయ్య, కార్యదర్శిగా జి.శేఖర్, జిల్లా యువజన విభాగంలో ప్రధాన కార్యదర్శి పి.హేమంత్ రెడ్డి, కార్యదర్శిగా కేజీ రోషిరెడ్డి, జిల్లా మహిళా విభాగంలో ప్రధాన కార్యదర్శిగా కె.కవిత, జిల్లా పబ్లిక్ వింగ్ విభాగంలో ప్రధాన కార్యదర్శిగా డి.మణి, కార్యదర్శిగా ఓడూరు ఉజ్వల్ రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా ఎంపీ రవి, జిల్లా వైఎస్సార్ పీయూసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా మునిరత్నం రెడ్డి, జిల్లా బీసీ సెల్ విభాగం కార్యదర్శిగా బొప్పన సోమశేఖర్‌లను నియమించినట్లు సమన్వయకర్త రాజేష్ వివరించారు.

మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏర్పేడు: స్థానిక ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం ఆశ్రమ పూర్వ విద్యార్థులు భూమిపూజ చేశారు. వ్యాసాశ్రమం స్థాపించి 100ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. ఇందుకోసం రూ.30లక్షలకు పైగా నిధులు సమీకరించారు. ఏర్పేడు-వెంకటగిరి కూడలి వద్ద విగ్రహం ఏర్పాటు చేయాలని తొలుత నిర్ణయించారు. అయితే అక్కడ అనుమతి లభించకపోవడంతో ఏర్పేడు శివారున చెరువు కట్ట పక్కన భూమిపూజ చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాల నాటికి ప్రతిష్ఠాపన పూర్తిచేస్తామని చెప్పారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రవి

చేతుల శుభ్రతపై అవగాహన

సత్యవేడు: విద్యార్థులు చేతుల శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ కే.రవి అన్నారు. గురువారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డేను పురస్కరించుకుని స్థానిక మెయిన్ స్కూల్‌లో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ యాంకర్ పానాసోనిక్ ఆర్థిక సాయంతో పాఠశాలల విద్యార్థులకు చేతి శుభ్రత కిట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. విద్యార్థులు చేతి గోర్లు పెంచుకోకుండా కట్ చేయాలన్నారు. చేతుల శుభ్రతపై డ్రాయింగ్ పోటీల నిర్వహించారు. విజేతలైన కీర్తిక, హిమాన్స్యల్, సుజిత్ కవిన్య, హర్ష, జస్వంత్రి, సాత్విక్, పల్లవి, చైత్రలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.